
ప్రజాశక్తి
ఆదివారం 11 ఆగస్టు 2024 5 విజయనగరం



విజయనగరం జెసిగా సేతు మాధవన్

ప్రజాశక్తి - విజయనగరం

విజయనగరం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా సేతుమాధవన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన పార్వతీపురం ఐటిడిఎ పిఒగా ఇటీవలే బాధ్యతలు స్వీకరించారు. కొద్దిరోజుల్లోనే జెసిగా బదిలీ చేసింది. ఇప్పటి వరకూ విజయనగరం జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న కె.కార్తీక్‌ను నెల్లూరు జిల్లా అదనపు జాయింట్ కలెక్టర్‌గా బదిలీ అయ్యింది.



జెసి సేతు మాధవన్

నిజాలు రాసే పత్రికల్లో ప్రజాశక్తిదే అగ్రస్థానం

- ప్రజాశక్తి లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లాలి
- 44వ వార్షికోత్సవ సభలో వక్తలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమాజంలో ఉన్నది ఉన్నట్లు నిజాలను రాసే పత్రికల్లో ప్రజాశక్తి దే అగ్రస్థానమని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. ప్రజాశక్తి ప్రజల పత్రిక అని కొనియాడారు. ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ సభ శనివారం జెడ్‌పి సమావేశ మందిరంలో ఘనంగా జరిగింది. ముందుగా ప్రజాశక్తి వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు చిత్రపటానికి అతిథులు కలెక్టర్ అంబేద్కర్‌తో పాటు విశిష్ట అతిథులు జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు తదితతరులు కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజాశక్తి ముద్రించిన 44వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను అతిధులు ఆవిష్కరించారు. అనంతరం ప్రజాశక్తి స్టాఫ్ రిపోర్టర్ కె.రమేష్ నాయుడు అధ్యక్షతన జరిగిన సభలో కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ ప్రజాశక్తి కుటుంబ సభ్యులకు వార్షికోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. పత్రికా రంగంలో నేడు అనేక మార్పులు వస్తున్నాయని, సమాజంలో ఎన్ని మార్పులు వచ్చినా ఒక ఆశయం కోసం ఏర్పడిన పత్రిక ప్రజాశక్తి అన్నారు. పత్రిక ఏ భావజాలంతో, ఏ విలువలతో ఏర్పడిందో దానిని చివరి వరకు తీసుకెళ్లాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. వాస్తవాన్ని నిర్భయంగా రాసినప్పుడే విలువ ఉంటుందన్నారు. తాము చేసే తప్పులు రాయడం వలన వాటిని సరిద్దిద్దుకునే అవకాశం ఉంటుందన్నారు.



కలెక్టర్ అంబేద్కర్



మోటూరు హనుమంతురావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అతిథులు



ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అంబేద్కర్, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, డిఐపిఆర్ఓ డి.రమేష్, పిపిఎస్ఎస్ నాయకులు వై.వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ, తదితరులు

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ నేడు సాంకేతికంగా వృద్ధి చెందుతున్న కాలంలో పత్రికలకు కొంత ఆదరణ తగ్గినప్పటికీ ప్రజల గొంతు వినిపించడంలో ప్రజాశక్తి ప్రముఖ పాత్ర పోషిస్తోందన్నారు. పత్రిక నడపడం, వార్తలు రాయడంలో అనేక సవాళ్లు ఉన్నప్పటికీ వాటిని ఎదుర్కొని ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రజాశక్తి ముందుకు సాగుతుందన్నారు. ప్రజాశక్తికి ఎప్పుడూ అండదండగా ఉంటామన్నారు. ప్రజాస్వామ్య వాదులు,ప్రజల సహకారం ఉంటుందని తెలిపారు. ఏ లక్ష్యంతో ప్రజాశక్తి పని చేస్తుందో ఆ కృషిని మరింత ముందుకు తీసుకువెళ్లాలని అన్నారు.



జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ సమాజంలో నాలుగు మూలస్తంభాల్లో ప్రతికలు ఒకటన్నారు. అయితే నేడు రాజకీయ పార్టీలకు అండగా మారిపోయిన పరిస్థితిలో ప్రజాశక్తి ప్రజల తరుపున ప్రజల పత్రికగా ఉండటం అభినందనీయమన్నారు. పత్రికలు నిష్పక్ష పాతంగా ఉన్నపుడే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. నేడు పత్రికలకు ధీటుగా సోషల్ మీడియా దూసుకుపోతోందని, ఈ పోటీ ప్రపంచంలో ప్రజాశక్తి కూడా సోషల్ మీడియాలో దూసుకుపోవాలని సూచించారు. నిష్పక్షపాతంగా ప్రజాశక్తి వార్తలు ఇస్తూ మరింత అభివృద్ధి కావాలని ఆకాక్షించారు.



ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో ప్రారంభమైన ప్రజాశక్తి అనేక ఆటుపోట్లను ఎదుర్కొని నిలబడిందన్నారు. రాష్ట్రంలో తొలి తెలుగు దిన పత్రిక ప్రజాశక్తి అన్నారు. ఒక లక్ష్యంతో, సామాజిక బాధ్యతగా ఉందన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చే ప్రయత్నంలో ప్రజాశక్తిది అగ్రభాగమన్నారు. ప్రపంచంలోనే మన దేశంలో పత్రికా రంగంలో జర్నలిస్టులు సవాళ్లను, సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులు, దళితులు, గిరిజనులు, పేదలు, కార్మికులు సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. ప్రజల సహకారంతో నడుస్తోందని, మరింత ఎదుగుదలకు అందరూ సహకరించాలని ఆయన కోరారు.



పిపిఎస్ఎస్ నాయకులు వై.వెంకటేశ్వరరావు

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రతి అక్షరం ప్రజలు పక్షం అనే నినాదంతో అప్రతిహతంగా ముందుకు సాగుతోందన్నారు. సమాజంలో జరుగుతున్న తప్పులు ఒప్పులను తెలియచేసే స్పష్టంగా, సూటిగా చెప్పే పత్రిక అని కొనియాడారు. సమాజం కోసం ఆలోచించే శక్తుల కోసం పని చేస్తుందన్నారు. నేడు సమాజంలో ఏదీ నిజమో తెలుసుకోవాలంటే ప్రజాశక్తి చదవాలన్నారు. సమాజం మార్పు కోసం, పేదలు,రైతులకు,కార్మికులు, దళితులు, గిరిజనులకు న్యాయం కోసం పత్రిక నడుస్తుందన్నారు. ప్రజాశక్తి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.



సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని

జిల్లా సమాచార, పౌరసంబంధాలశాఖ అధికారి డి.రమేష్ మాట్లాడుతూ ప్రజాశక్తి ప్రజలను చైతన్య పరిచి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. ప్రజా పక్షంగా ఉండటం వల్ల శాశ్వత పాఠకులు ఉన్నారన్నారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కార పత్రికగా ఉండాలన్నారు.



డిఐపిఆర్ఓ డి.రమేష్

ప్రజాశక్తి శ్రీకాకుళం బ్రాంచి మేనేజర్ పి.కామినాయుడు మాట్లాడుతూ అనేక ఒడిదుడుకులు మధ్య పత్రిక నిలబడిందన్నారు. కరోనా సమయంలో కూడా అనేక ఇబ్బందులకు ఓర్చి నిలబడిందన్నారు. ప్రశ్నించే గొంతుకగా నిలబడిన ప్రజాశక్తి ప్రజల సహకారంతో 44 ఏళ్లు పత్రిక నిలబడటం గర్వంగా భావిస్తున్నామన్నారు. సామాజిక బాధ్యతగా అనేక విపత్కర పరిస్థితుల్లో అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య మార్గదర్శకాల్లో, మోటూరు హనుమతురావు మార్గనిర్దేశనంలో ముందుకు నడుస్తోందన్నారు. మరింత అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. స్టాఫ్ రిపోర్టర్ రమేష్‌నాయుడు మాట్లాడుతూ ప్రజాశక్తి ప్రస్తానాన్ని వివరించారు. ప్రజా సమస్యలను వెలికి తీయడంలో ప్రజాశక్తి ముందుంటుందని తెలిపారు.



ప్రజాశక్తి శ్రీకాకుళం బ్రాంచి మేనేజర్ పి.కామినాయుడు

ఈ సందర్భంగా జెవివి సభ్యులు డప్పు శ్రీను, పిఎన్ఎం కళాకారులు అభ్యుదయ గేయాలతో ఉర్రూతలూగించారు. సభలో ప్రజాశక్తి జిల్లా మేనేజర్ సిహెచ్ రాము, సిబ్బంది, ఉద్యోగులు, అధిక సంఖ్యలో అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి ఉద్యమం

యుటిఎఫ్ నేతల పిలుపు ● ఘనంగా యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం శనివారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద ఘనంగా జరిగింది. జిల్లా అధ్యక్షులు జెఆర్‌సి పట్నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ పతాకాన్ని రాష్ట్ర నాయకులు డి.రాము ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ ఏదైతే లక్ష్యం కోసం ఏర్పడిందో ఆ లక్ష్యాన్ని సాధించేందుకు, ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేసేందుకు,పేదలకు ప్రభుత్వ విద్యను అందించేందుకు సామాజిక బాధ్యతగా కృషి చేయాల్సిన కర్తవ్యం ఉపాధ్యాయులపై ఉందని అన్నారు. మన జెండా అందించిన స్ఫూర్తితో సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఉపాధ్యాయుడూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, కోశాధికారి సిహెచ్ భాస్కరరావు, జిల్లా కార్యదర్శులు కె.ప్రసాదరావు, సిహెచ్ తిరుపతి నాయుడు, జి.రాజారావు, ఎ.శంకరరావు, మహిళా నాయకులు జి నిర్మల, వి.హేమలత వివిధ మండల నాయకులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా యుటిఎఫ్ పనిచేస్తుందని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి అన్నారు. స్థానిక సిబిఎం బాలికోన్నత పాఠశాలలో శనివారం యుటిఎఫ్ సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యుటిఎఫ్ స్థాపన నుంచి విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి పోరాటం చేస్తున్నామని చెప్పారు.



విజయనగరంలో యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్వర్ణోత్సవాలు సందర్భంగా ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ బొబ్బిలి మండల, పట్టణ, రామభద్రపురం, బాడంగి, తెర్లాం మండలాల ప్రధాన కార్యదర్శులు బత్తుల శ్రీనివాస్, రాధాకృష్ణ, సుధాకర్, రామారావు, శంకరరావు, మహేష్, జిల్లా కౌన్సిలర్లు ఆనెం శ్రీనివాస్, సత్యనారాయణ, రామకృష్ణ, సామాజిక కార్యకర్త కృష్ణదాసు పాల్గొన్నారు.

కొత్తవలస : కొత్తవలసలోని ప్రాథమిక పాఠశాల వద్ద యుటిఎఫ్ పతాకాన్ని మండల గౌరవ అధ్యక్షులు నీలి సత్యప్రసాద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.నిర్మలదేవి, జి.విజయగౌరి, జిల్లా నాయకులు జి.వెంకటనాయుడు, పి.రమేష్, సిహెచ్.విజయబాపన్న, నాయకులు వి.వాసు, సిహెచ్. శ్రీనివాసరావు ఎన్. ఆంజనేయులు, కె.బాపునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గరివిడి : యుటిఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవ సంబరాలను పురస్కరించుకొని స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో పతాక ఆవిష్కరణను రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎ. సత్య శ్రీనివాసు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం. అప్పలనాయుడు, జిల్లా కార్యదర్శి సూరి శ్రీనివాసు, మండల బాధ్యులు రవికుమార్, సతీష్, జి.లక్ష్మణ, జి.పద్మజ, బి. బంగార్రాజు, ఎం. రఘునాథరాజు, మీసాల శ్రీను, మామిడి శ్రీను, వరప్రసాద్, కోట్ల రమణ, త్రినాథ్, కుప్పిలి శ్రీను, ఎం. సూర్యనారాయణ, డి. కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జామి : యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎంపిపి స్కూల్‌లో సీనియర్ రిటైర్డ్ ఉపాధ్యాయులు చలుమూరి సత్యనారాయణ పతాకావిష్కరణ చేశారు ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు మాట్లాడుతూ డిసెంబర్‌లో కాకినాడలో నిర్వహించే 50 సంవత్సరాల యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలకు మన మండల ఉపాధ్యాయులు ఎక్కువ సంఖ్యలో హాజరుకావాలని కోరారు.



బొబ్బిలి... యుటిఎఫ్ జెండావిష్కరణలో పాల్గొన్న నాయకులు

బుద్ధదేవ్ భట్టాచార్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

సిపిఎం నాయకులు వైవి పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్య మంత్రి, సిపిఎం సీనియర్ నేత బుద్ధదేవ్ భట్టాచార్యకు సిపిఎం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. బుద్దదేవ్ సంతాప సభ శనివారం స్థానిక ఎల్‌బిజి భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బుద్ధదేవ్ మృతి వామపక్ష ఉద్యమానికి తీరనీ లోటన్నారు. బుద్ధదేవ్ భట్టాచార్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామన్నారు. ఆయన ఆశయాల సాధనకు సిపిఎం పనిచేస్తుందని తెలిపారు.



బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు వైవి, తమ్మినేని

1996లో విద్యార్థి దశలో పార్టీలో చేరిన ఆయన విద్యార్థి, యువజన ఉద్యమాల్లోను, పలు ప్రజా ఉద్యమాల్లోనూ పాల్గొన్నారని తెలిపారు. 1968లో పశ్చిమబెంగాల్ డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారని,. 1971లో పార్టీ రాష్ట్రకమిటీకి, 1982లో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా ఎన్నికయ్యారని తెలిపారు. ఈ కాలంలోనే ఆయన అంకిత భావంతో వివిధ బాధ్యతలను నిర్వహించే ముఖ్యమైన పార్టీ నేతగా ఎదిగారన్నారు. 1985లో నిర్వహించిన పార్టీ 12వ మహా సభల్లో కేంద్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారని,. 2000 నవంబర్‌లో పార్టీ సీనియర్ నేత జ్యోతి బసు నుండి పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన తర్వాత మరో రెండు పర్యాయాలు ముఖ్యమంత్రి ఎన్నికయ్యారని తెలిపారు. 2000 నుంచి 2015 వరకు పొలిట్‌బ్యూరో సభ్యులుగా కొనసాగారన్నారు. పార్టీ విధానాలను రూపొందించడంలో గణనీయమైన కృషి చేశారన్నారు. వామపక్ష ప్రభుత్వ విధానం, ప్రణాళికల అమలులో కీలక పాత్ర పోషించారన్నారు. సాహిత్యంపై మంచి అభిరుచి కనబరిచేవారన్నారు. పలు అంతర్జాతీయ సాహిత్య రచనలను బెంగాలీలోకి అనువదించారన్నారు. సిపిఎం జిల్లాకార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ బుద్ధదేవ్ అంకితభావంతో కూడిన కమ్యూనిస్టుగా, అత్యంత సాధారణ జీవితాన్ని గడిపారని తెలిపారు. ఆయన స్ఫూర్తితో ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. ఆయన భార్య మీరా, కుమారుడు సుచేతన్‌లకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాత్రి 11 గంటల తరువాత వ్యాపారాలు ముగించాల్సిందే

ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో ముఖ్య పట్టణాల్లో రాత్రి 11 గంటల తరువాత ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో సంచరించినా, వ్యాపారాలు సాగించినా వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులను ఎస్‌పి వకుల్ జిందాల్ ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో భాగంగా కొన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. పట్టణాల్లో రాత్రి 11గంటల తరువాత అన్ని రకాల వ్యాపారాలను బంద్ చేయాలని స్పష్టంచేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యాపారాలు సాగిస్తే వారిపై కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. రాత్రి సమయాల్లో ఎక్కువగా యువత పట్టణాల్లో సహేతుకరమైన కారణాలు లేకుండా విచ్చలవిడిగా తిరుగుతున్నారని చెప్పారు. రాత్రి గస్తీ, పెట్రోలింగు నిర్వహించే పోలీసు సిబ్బంది, అధికారులు ఇటువంటి వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్‌పి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ముఖ్య కూడళ్ళల్లో అర్ధరాత్రి వరకూ వ్యాపారాలు నిర్వహించే టిఫిన్, పాన్ షాపులను, చిరు వ్యాపారులను కట్టడి చెయ్యాలని సూచించారు. రాత్రి 11గంటల తరువాత వ్యాపారాలు నిర్వహించినా, బహిరంగ ప్రదేశాల్లో అనుమానాస్పదంగా సంచరించినా వారిపై కేసులు నమోదు చేయాలని అధికారులను ఎస్‌పి ఆదేశించారు.



వన్‌టౌన్ స్టేషన్‌లో యువతకు కౌన్సిలింగ్ ఇస్తున్న సిఐ శ్రీనివాస్

రైల్వేస్టేషను వద్ద గత రాత్రి 11 గంటల తరువాత పట్టుబడిన యువతను ఎస్‌పి ఆదేశాల ప్రకారం వన్ టౌన్ సిఐ పోలీసు స్టేషనుకు తరలించి, కౌన్సిలింగ్ నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై కూడా దాడులను విస్తృతం చేయాలని ఎస్‌పి ఆదేశించారు. పట్టణ, గ్రామ శివార్లలోని లే-అవుట్లు, నిర్జన ప్రదేశాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపైనా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపైనా కేసులు నమోదు చేయాలన్నారు. అంతేకాకుండా, మద్యం సేవించి వాహనాలను నడిపి, ప్రమాదాలకు కారణమవుతున్న వాహనదారులపైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి తైక్వాండో ఎంపికలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రెండు రోజులు పాటు స్థానిక రాజీవ్ గాంధీ క్రీడా మైదానంలో జరిగిన తైక్వాండో రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలు శనివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర మేయర్ వెంపటాపు విజయలక్ష్మి లక్ష్మి పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ టి .చంద్రమౌళి , రాష్ట్ర తైక్వాండో ప్రతినిధులు సుంకర సతీష్ కుమార్, అంతర్జాతీయ క్రీడాకారుడు రషీద్ పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో పథకాలు సాధించి జిల్లాకు, ఆంధ్రప్రదేశ్‌కు పేరు ప్రతిష్టలు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు డి.వై చారి , అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బదిలీల్లోనూ రాజకీయం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పోలీసుల లంటే సగటు ప్రజలకు ఓ భరోసా. ఆపదలో ఉన్నప్పుడు రక్షణగా నిలుస్తారని, అన్యాయం జరిగిన చోట బాధితుల పక్షాన నిలిచి అక్కున చేర్చుకుంటారని నమ్మకం. కానీ, నేడా పరిస్థితులు తలకిందులుగా కనిపిస్తున్నాయని జనం చర్చించుకుంటున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. నచ్చిన చోటకు బదిలీ కోసం డబ్బులు చేతబట్టుకుని క్యూ కడుతున్నారని ఆరోపణలు వచ్చాయి. జిల్లాలో సిఐల బదిలీలో భారీగా ప్రజాప్రతినిధులకు ముట్టజెప్పారని బహిరంగంగా చర్చనడుస్తోంది. అలాగని తప్పంతా పోలీసులదే అని అనలేం కూడా. పుచ్చుకునే వారుంటే నచ్చిన చోటుకు వెళ్లేందుకు ఇచ్చేవారు ఉంటూనే ఉంటారు. కారణం ఏదైనా పోలీసుల బదిలీలు, పోస్టింగుల్లో మునుపెన్నడూ లేనంతగా రాజకీయ నాయకుల జోక్యం పెరిగిపోయింది. ఈ మాటకొస్తే బదిలీలు జరుగుతున్నప్పుడు రాజకీయ సిఫార్సులు సహజం. ప్రత్యేక పరిస్థితులు ఉన్నప్పుడు ప్రజాప్రతినిధులు ఆ మాత్రం రిఫరెన్స్ చేయడంలో తప్పులేదంటారు కొందరు. కానీ, మరీ ఇంతలా నోరున్నవాడిదే కూడు అన్నట్టుగా కాస్త మాటమెలికలు తిప్పి, పైకాన్ని ఎరవేసే వారికే కోరుకున్న చోట పోస్టింగులు ఇస్తామంటే ఎంత వరకు సమంజసం? అన్నది పలువురు సంధిస్తున్న ప్రశ్న. పోస్టింగుల కోసం డబ్బులిచ్చే రక్షక భటులు తిరిగి ఆ డబ్బులు రాబట్టుకోవడానికి ప్రయత్నించరన్న గ్యారెంటీ ఏమిటి? సిఫార్సులు చేసిన నాయకులు, లేదా ప్రజాప్రతినిధులు చెప్పుచేతల్లో బందీలు కాబోరని ఎవరైనా



చెప్పగలుగుతారా? అని కూడా చాలా మందినోట వినిపిస్తున్న మాట. ఇలా సిఫార్సు చేసినవారే భవిష్యత్తులో అన్యాయం, అక్రమాలకు పాల్పడినవారికి అండగా నిలిస్తే పోలీసులు వారిని ఎదురించగలగుతారా? దీన్నిబట్టి పోలీసులు కూడా తమ స్వతంత్రతను కోల్పోవాల్సిన దుస్థితి ఉంటుంది. సరే....! రాజకీయ సిఫార్సులతో పోస్టింగులు వేయించుకున్నవారు, ఏ సిఫార్సులూ లేకుండా బదిలీవేటుకు గురైన వారు ఒకేలా పని చేయగలరా? అలా పనిచేస్తే ఊరుకునేంత సహనం అధికార పార్టీ నాయకులకు ఉంటుందా? ఇవన్నీ జనం నుంచి వినిపిస్తున్న సందేహాలే. ఉద్యోగులకు, అధికారులకు బదిలీలు అనేవి సర్వ సాధారణం. ఇందులో భాగంగా కొందరు పట్టణాల్లోనూ, మరికొందరు మైదానంలోనూ, ఇంకొందరు కొండకోణల్లోనూ పనిచేయాల్సి వస్తుంది. వారి సమర్థత, లేదా హోదాను బట్టి కూడా కొన్ని స్థానాలకు అనుకోకుండా వెళ్లాల్సివుంటుంది. ఇటువంటి సందర్భాల్లో కుటుంబ సమస్యలు ఉన్నవారికి, లేదా ఇతర అవసరాల రీత్యా ఉన్నతాధికారులు కూడా పోస్టింగుల విషయంలో కొంత వెసులుబాటు ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. ఇది సహజం. కానీ, మాటకారులకు, డబ్బులు విరజల్లేవారికే నచ్చినచోట పోస్టింగులంటే... అదీ పోలీస్ శాఖలో ఉంటే ఊహలకందని పరిణామమే. ఇదే పరిస్థితి కొనసాగితే సగటు మనిషి దోపిడీకి గురైనా అడిగే నాథుడు కరువవుతాడనంలో ఎలాంటి సందేహం లేదు. పోలీసులు కూడా వారికున్న విలువలను కోల్పోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని పబ్లిక్ టాక్.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు 32మంది ఎంపిక

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు 32 మంది ఎంపికైనట్లు వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి, కోచ్ చల్లా రాము తెలిపారు. శనివారం కొండవెలగాడ చల్లా రాము శిక్షణా కేంద్రంలో రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికలు జరిగాయి. ఈ సందర్భంగా ఈ నెల 30, 31తేదీల్లో అనకాపల్లిలో మూడు రోజుల పాటు జరగనున్న రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు గాను ఎంపికలు నిర్వహించామన్నారు. సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ బాలురు, బాలికలు, విభాగంలో మొత్తం 32 మంది ఎంపికైనట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయిన క్రీడాకారులను అభినందించారు.

ముఖ్యమంత్రికి పాలాభిషేకం

ప్రజాశక్తి-కొత్తవలస

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి రేషన్ డీలర్లు పాలాభిషేకం చేశారు. డీలర్ల కష్టాలు తెలుసుకొని, వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయమని రేషన్ డీలర్ల సంఘం నాయకులు బి.రామలింగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

హైకోర్టు స్టేటస్‌కో నోటీసులు ఇచ్చిన చెరువులో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్త సన్యాసి శెట్టి.. తహశీల్దార్ అరుణకుమారికి శనివారం వినతి పత్రం అందజేశారు. పట్టణంలో 7.25 ఎకరాల విస్తీర్ణంలోని బాబుచెరువును కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు రాజకీయ నాయకుల అండదండలతో లే-అవుట్ వేసి ప్లాటుగా విభజించి విక్రయిస్తున్నారని ఆయన తెలిపారు. చెరువు విషయమై హైకోర్టును ఆశ్రయించగా స్టేటస్కో ఆర్డర్ విధించినా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోలేదని చెప్పారు. వెంటనే చెరువు భూమిపై హెచ్చరిక బోర్డులు పెట్టి, ఏవిధమైన లావాదేవీలు జరపకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా ఎంపిపి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-వేపాడ

ఎంపిపి దొగ్గ సత్యవంతుడు జన్మదిన వేడుకలను శనివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులతో కలిసి పుట్టినరోజు వేడుకలు చేసుకున్నారు. వైస్ ఎంపిపి ఈశ్వరరావు, సోంపురం ఎంపిటిసి సభ్యులు ఆకుల సత్తిబాబు, చామంతులు గంగాధర్, జెఎసిఎస్ కన్వీనర్ శ్రీను, చామలాపల్లి సర్పంచ్ కోల సతీష్, నాయకులు బొడ్డు శ్రీను, నిరుజోగి శ్రీను, చప్ప గడ్డి రమణ తదితరులు ఎంపిపికి శుభాకాంక్షలు తెలిపారు.



కమాండ్ ఆఫీసర్ నీరజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

ఎన్‌సిసి యూనిట్ పరిశీలన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సిసి యూనిట్‌ను 13(ఎ) ఆంధ్ర బెటాలియన్ కమాండ్ ఆఫీసర్ నీరజ్ కుమార్ శనివారం ఆకస్మాత్తుగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా యూనిట్‌లో ఉన్న 50 మంది ఎన్‌సిసి క్యాడెట్ల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు మాట్లాడుతూ ఎన్‌సిసి సర్టిఫికెట్ పొంది విద్యార్థులు నేవీ, ఆర్మీలకు ఎంపికవుతున్నారని తెలిపారు. గత రెండేళ్ల నుంచి అగ్నిపథ్‌కు కళాశాల నుంచి ఎంపికయ్యారని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌సిసి ఆఫీసర్ ఎస్‌కె వలిఖాన్, వైస్ ప్రిన్సిపల్ కె.వాసుదేవరావు, ఐక్యూఎసి కోఆర్డినేటర్ డాక్టర్ సుధీర్, ఎన్ఎస్-ఎస్ పిఒ డాక్టర్ జి.ఈరన్న, చల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నెల్లిమర్లలో పరిశమ్ర ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- నెల్లిమర్ల



అచ్చంనాయుడు

యువతకు ఉపాధి కల్పన నేపథ్యంలో నెల్లిమర్లలో ప్రభుత్వ సెక్టార్ పరిశ్రమను ఏర్పాటు చేయాలని జనసేన మండల అధ్యక్షులు పతివాడ అచ్చంనాయుడు కోరారు. ఈ మేరకు శనివారం ఆయన జనసేన అధ్యక్షులు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్‌కు లేఖ రాశారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే లోకం మాధవి గెలుపునకు యువత చాలా మంది కష్టపడ్డారని అటువంటి యువత ఉద్యోగాలు లేక ఇబ్బందుల పడుతున్నారని ఈ నేపథ్యంలో నెల్లిమర్లలో ఒక పరిశ్రమ ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని లేఖలో పేర్కొన్నారు. ఇప్పటి వరకూ ఇటువంటి కార్యక్రమాన్ని ఏ పార్టీ చేయలేదు కాబట్టి జనసేన చరిత్రలో నిలిచిపోయేలా ఒక పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరారు.

ఎరువులు పంపిణీ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో ఎన్‌కెఆర్‌పురం గ్రామంలో రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు అవసరమైన ఎరువులను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జి.దేవి, డిసిసిబి మాజీ చైర్మన్ వి.వి.చినరామునాయుడు, ఉప సర్పంచ్ కె.పెదనాయుడు, మాజీ ఎంపిటిసి వి.జగ్గుబాబు, తదితరులు పాల్గొన్నారు.



ఎరువులు పంపిణీ చేస్తున్న చినరామునాయుడు తదితరులు

తోక జాడిస్తే.. ఆట కట్టిస్తున్నారు

- నేరాలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్న ఎస్‌పి జిందాల్
- జూదం, అసాంఘిక కార్యకలాపాలపై విస్తృతంగా దాడులు
- ఇసుక, పశు అక్రమ రవాణాపై ఉక్కుపాదం

ప్రజాశక్తి-విజయనగరం కోట

జూదం, బహిరంగంగా మద్యం సేవించడం, రాత్రివేళల్లో కారణం లేకుండా సంచరించడం, డ్రైవింగ్ లైసెన్స్, సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడపడం, డ్రంకన్ డ్రైవ్... ఇవన్నీ పెట్టీ కేసులే. చూడ్డానికి చిన్న నేరాలే అయినా, అనేక కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాయి. ఇలాంటి వాటికి ఎస్‌పి వకుల్ జిందాల్ ప్రత్యేక దృష్టి పెట్టి, అడ్డుకట్ట వేయిస్తున్నారు. గంజాయి, మద్యం, నాటుసారా, పశుఅక్రమ రవాణాపైనా ఉక్కుపాదం మోపుతున్నారు. ఎక్కడికక్కడ విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. గత రెండు వారాలుగా రోజూ నమోదవుతున్న కేసులే అందుకు నిదర్శనం.

గత నెల 17న ఎస్‌పిగా వకుల్ జిందాల్ బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లాకు ఆనుకొని ఏజెన్సీ ప్రాంత జిల్లాలు, ఒడిశా సరిహద్దు రాష్ట్రంగా ఉండడం వల్ల గంజాయి రవాణాకు ఆస్కారం ఉందని, అందులో ప్రధాన వ్యక్తులను, వాటి మూలాలను గుర్తించి, కఠిన చర్యలు చేపడతామని ఆ సమయంలోనే ప్రకటించారు. గంజాయి రవాణా కేసులను సమీక్షించి, వ్యూహ రచన చేసి, అడ్డుకట్ట వేస్తామని వెల్లడించారు. ఆ రోజే జిల్లాలోని పోలీసు అధికారులతో సమావేశమై, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాల్సిందేనని స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. గంజాయి రవాణా నియంత్రణకు ప్రాధాన్యతనివ్వడంతోపాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే రౌడీషీట్లు, చెడు నడత కలిగిన వ్యక్తుల చర్యలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. ఆ దిశగా జిల్లా పోలీసు శాఖ కదులుతూ గత 25 రోజులుగా విస్తృతంగా దాడులు చేపడుతోంది. రోజూ పదుల సంఖ్యల కేసులు నమోదు చేస్తోంది. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ తోక జాడిస్తున్న వారి ఆటకటిస్తోంది. ఇటీవల కాలంలో గంజాయి రవాణాపై పోలీసులు ఎక్కడికక్కడ దాడులు చేస్తున్నారు.



కారులో తనిఖీ చేస్తున్న పోలీసులు

విస్తృతంగా తనిఖీలు

☞ జిల్లాలో శనివారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. భోగాపురం మండలం బసవపాలెం గ్రామ శివార్లలోని జీడి తోటలో పేకాట ఆడుతున్న వారిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకొన్నారు. వారి వద్ద నుండి రూ.1,26,500 నగదు, 11 మొబైల్స్, 3 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఎస్‌పి వకుల్ జిందాల్‌కు వచ్చిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిఐ అశోక్ కుమార్, ఎస్ఐ సాగర్ బాబు ఆధ్వర్యంలో పోలీసులు ఈ దాడులు చేశారు. తదుపరి చర్యల నిమిత్తం భోగాపురం పోలీసులకు అప్పగించారు. భోగాపురం సిఐ ఎ.రవికుమార్ విచారణ చేపట్టి, పేకాట ఆడిన 15 మందిపై కేసు నమోదు చేసి, నిర్వాహకుడితో సహా 14 మందిని అరెస్టు చేశామని ఎస్‌పి తెలిపారు. పరారీలో ఉన్న మరో వ్యక్తి గురించి కూడా భోగాపురం పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు.

☞ గంట్యాడ మండలం రామవరం గ్రామం వద్ద ఎస్ఐ బి.సురేంద్ర నాయుడు, సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. తమిళనాడుకు చెందిన ఒక వ్యాపారి కంటైనరులో 40 పశువులను తరలిస్తుండగా పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి, 10 పశువులను, కంటైనరును సీజ్ చేశారు.

☞ నెల్లిమర్ల మిమ్స్ ఆసుపత్రి సమీపంలో ఎస్ఐ రామ గణేష్ ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మికంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఒకరిని అదుపులోకి తీసుకొని, లారీ, 10 టన్నుల ఇసుకను సీజ్ చేశారు.

☞ విజయనగరం రెండో పట్టణ పోలీసు స్టేషను పరిధిలో కొత్తపేట మండపం వద్ద రెండో పట్టణ ఎస్ఐ ఐ.దుర్గా ప్రసాద్, సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. బొలేరో వాహనంలో పిడిఎస్ బియ్యం విశాఖపట్నం తరలిస్తున్న ఒకరిని అదుపులోకి తీసుకొన్నారు. 50 బస్తాల బియ్యం, బొలేరో వాహనాన్ని సీజ్ చేశారు.

☞ జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు, డ్రంకన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ తనిఖీలు చేపట్టి, నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేశారు. వాహన తనిఖీల సమయంలో మోటారు వెహికల్ నిబంధనలను అతిక్రమించిన 339 మందికి 95,455 రూపాయల ఇ-చలానాలను విధించారు.



అధ్వానంగా ఉన్న నెమలాం రోడ్డు

నెమలాం రోడ్డుకు మోక్షమెప్పుడు?

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని సతివాడ నుంచి నెమలాం గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. ఏళ్ల తరబడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. పార్టీలు మారినా ఈ రోడ్డుకు మాత్రం మోక్షం కలగడం లేదు. ఆటోలు, బస్సులే కాదు కదా కాలినడకన వెళ్లేందుకు కూడా తంటాలు పడాల్సి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెమలాంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సతివాడ నుంచి సుమారు 35 నుంచి 40 మంది పిల్లలు ప్రతిరోజు కాలినడకన, కొంతమంది సైకిల్‌తో వెళ్లి వస్తుంటారు. వర్షాకాలం వచ్చిందంటే అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితిలో సుమారు రెండు కిలోమీటర్ల రోడ్డు బురదమయమై ఇబ్బందులకు గురువుతున్నారు. విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని రాజకీయాలకు అతీతంగా రోడ్డును బాగు చేయాలని సతివాడ, నెమలాం గ్రామ ప్రజలు కోరుతున్నారు.



మంత్రి శ్రీనివాస్‌కు సమస్యలు వివరిస్తున్న ప్రజలు

మాజీ మంత్రికి నివాళి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కీర్తి శేషులు మాజీ మంత్రి సాంబ శివరాజు వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ పి.సురేష్‌బాబు నివాళులర్పించారు. శనివారం ఆయన స్వగ్రామం మొయిద విజయరాంపురంలోని స్మృతి వనంలో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మొయిద జడ్పి ఉన్నత పాఠశాల స్కూల్ చైర్మన్‌గా ఎన్నికైన చందక త్రినాథ్‌ను ఎమ్మెల్సీ సురేష్ బాబు, జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు గ్రామ పెద్దలు సమక్షంలో అభినందించారు. స్కూల్ అభివృధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పతివాడ అప్పారావు, కర్రోతు వెంకట రమణ, మొయిద సర్పంచ్ అట్టాడ కృష్ణ, లెంక గోవింద, అట్టాడ కనక రావు, ధవళ లక్ష్మణరావు, ఎం.లక్ష్మణరావు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గత మూడు రోజులుగా స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో జరుగుతున్న సర్పంచులు, కార్యదర్శుల శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. దీనిలో భాగంగా సీతారామునిపేట గ్రామ సచివాలయంలో ఎస్‌డబ్ల్యూపి సెంటర్ పనిచేసే విధానం, సంపదను సృష్టించే విధానం గురించి, గ్రామ సర్పంచులు పంచాయతీ కార్యదర్శులకు ఎంపిడిఒ రామారావు వివరించారు. ఎపిఎస్ఐఆర్‌డిఎసి కృష్ణమోహన్ సందర్శించి శిక్షణా తరగతులు అమలు పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి కె. సింహాద్రి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంఒటిలు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

ప్రజాశక్తి - గరివిడి

కొండ లక్ష్మీపురం గ్రామానికి చెందిన వెంపడాపు కాళిదాసు అనారోగ్యానికి గురవ్వడంతో నెలకు రూ.8వేలు వరకు మందులకు ఖర్చు అవుతుంది. ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అదే గ్రామానికి చెందిన గుర్ల ఎఎస్ఐ కామేశ్వరరావు ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణకు వివరించారు. ఆయన ఈ విషయాన్ని అమెరికాలో ఉన్న సహృదయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తాడివాక బిందుకు తెలిపారు. ఆమె తక్షణమే స్పదించి రూ.10వేలు రూపాయలు పంపించారు. ఈ నగదును బాధితునికి శనివారం ఎఎస్ఐ బి.కామేశ్వరరావు, ఆశయసంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ అందజేశారు.

తహశీల్దారు కార్యాలయంలో సిసి కెమెరాలు

ప్రజాశక్తి - భోగాపురం

స్థానిక తహశీల్దారు కార్యాలయంలో సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇటీవలి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్నిప్రమాదంలో ఫైల్స్ కాలిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని తహశీల్దార్ల కార్యాలయాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు స్థానిక కార్యాలయంలో ఐదు సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భూముల రికార్డులు ఉన్న గదిలో కూడా సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం విశేషం.

ప్రజల నుంచి వినతులు స్వీకరించిన మంత్రి

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం జిల్లా పరిషత్తు అతిథి గృహంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో మంత్రిని కలిసి తమ సమస్యలను విన్నవించారు. వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు సూచనలు చేస్తామని మంత్రి తెలిపారు.

12న కలెక్టరేట్‌లో వినతుల స్వీకరణ

ఈ నెల 12న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారు. ఆరోజు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మంత్రి ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తారని కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలిపారు. జిల్లా ప్రజానీకం ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తమ సమస్యలు తీసుకురావచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రులు ప్రతి 15 రోజులకు ఒకసారి తమ జిల్లాల్లో ప్రజా వినతులు స్వీకరించే కార్యక్రమంలో పాల్గొనాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే. ఆ మేరకు జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వినతుల స్వీకరణ చేపడుతున్నట్టు వెల్లడించారు.



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

క్రమబద్ధ జీవన శైలితోనే ఆరోగ్యం

ప్రజాశక్తి-బొబ్బిలి

క్రమబద్ధమైన జీవన శైలితోనే ఆరోగ్యవంతులుగా ఉంటామని ప్రముఖ వైద్యులు ఎల్ఎన్ అభినయ్ అన్నారు. శనివారం బొబ్బిలి రోటరీ క్లబ్, ఎన్ఆర్ఐ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులను డాక్టర్ అభినయ్ పరీక్షించి ఉచితంగా మందులను అందించారు. అవసరమైన రోగులకు బిపి, షుగర్, రక్తపరీక్షలు చేశారు. దంత సమస్యలతో బాధపడుతున్న రోగులకు దంత వైద్యులు చికిత్స అందించారు. రోటరీ జిల్లా చైర్మన్ జెసి రాజు మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి, పేదలకు వైద్య సేవలు అందించేలా రోటరీ కృషిచేస్తుందన్నారు. అనంతరం వైద్యులను రోటరీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు సింద్రీ శ్రీనివాసన్, కార్యదర్శి సిహెచ్‌జె ప్రవీణ్, సభ్యులు సజ్జ అప్పలరాజు, కె.నాగరాజు, కె.రామకృష్ణ, కృష్ణమోహన్, శ్రీహరి, ఎన్ఆర్ఐ పిఆర్ఒ అవినాష్, సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి నాయకుల నిరసన



కొవ్వొత్తులతో ర్యాలీ చేపడుతున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, నాయకులు

ప్రజాశక్తి-పూసపాటిరేగ

విజయవాడ లోని అంబేద్కర్ స్మృతివనం వద్ద విధ్వంసాన్ని నిరసిస్తూ వైసిపి నాయకులు శనివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. అక్రమ కేసులు, దాడులు, దౌర్జన్యాలు ఎక్కువయ్యాయని తెలిపారు. టిడిపి చర్యలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

నగదు, బంగారం చోరీ నిందితులు అరెస్టు

ప్రజాశక్తి- విజయనగరం కోట

ఈ నెల 8న ఆర్‌టిసి కాంప్లెక్సులో బొబ్బిలి వెళ్లేందుకు వేచి ఉన్న ప్రదీప్‌నగర్‌కు చెందిన బెహరా మంగకు చెందిన బ్యాగ్ లో ఉన్న 50వేల రూపాయలు నగదు, అర తులం బంగారు శతమానాల్ని గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఈనేపథ్యంలో పోలీసులు నిందితులు ఎర్రసాని ఎర్రమ్మ, ఎర్రుల సాయికుమారి, ఉయ్యాల దుర్గమ్మను అదుపులోకి తీసుకొని వారి నగదు, బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. నిందితులంతా తాడేపల్లి గూడెంకు చెందిన వారని తెలిపారు. వీరంతా రద్దీ ప్రదేశాలలో ప్రయాణికులు వలే నటించి ఆర్టీసీ బస్సుల వద్ద ఆటో స్టాండ్ ల వద్ద ప్రయాణికుల నగదు, బంగారు నగలను తస్కరిస్తారని తెలిపారు. ప్రజలు తమ విలువైన వస్తువులను తీసుకొని వెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిఐ తెలిపారు. 48 గంటల్లో కేసును చేధించి చోరీ చేసిన మొత్తం నగదు, బంగారాన్ని రికవరీ చేసిన ఎస్ఐ జె.తారకేశ్వరరావును, కానిస్టేబుళ్ల శ్రీదేవి, శ్రీను, గౌరిని సిఐ అభినందించారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ప్రజాశక్తి - భోగాపురం

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను భోగాపురం స్పెషల్ ఎన్‌ఫోర్సమెంట్ బ్యూరో అధికారులు శనివారం ఉదయం పట్టుకున్నారు. చంపావతి నదిలో నుంచి అక్రమంగా ఇసుకను భోగాపురం తరలిస్తుండగా భోగాపురంలో సెబ్ అధికారులు పట్టుకున్నారు. వీటిని జిల్లా భూగర్భ జనుల శాఖ అధికారులకు అప్పజెప్పారు. వారు ఒక్కో ట్రాక్టర్‌కు రూ.10వేలు చొప్పున జరిమానా వేశారని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐ సురేష్ తెలిపారు. ఇసుకను ఎవరైనా అక్రమంగా తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం మేజర్ పంచాయతీలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. వ్యాధులు సంభవించే అవకాశం ఉండడంతో పంచాయతీ ఇంచార్జి ఇఒ మొంగం సురేష్ కాలువల్లో, గ్రామం మధ్యలో నిల్వ ఉన్న మురికి నీటిని తొలగిస్తున్నారు. కొయ్యపేటలో గ్రామస్తులు వాడే నీరు ఎటూ పోకపోవడంతో ఒకేచోట నిల్వ ఉండిపోయింది. ఈ నిల్వ ఉన్న మురికి నీటిని సెప్టిక్ ట్యాంక్ ద్వారా బయటకు తరలించి శుభ్రం చేశారు. సరివలస గ్రామంలో స్థానికులు ఇళ్లల్లో వాడే నీరు సిమెంట్ రహదారిపై నిల్వ ఉండిపోవడంతో గ్రామస్తుల రాకపోకలకు ఇబ్బందులు పడేవారు. ఈ మురికి నీటిలో నుంచే వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ఇక్కడ ఈ మురికి నీరు బయటకు వెళ్లేలా కాలువను శుభ్రం చేశారు. పంచాయతీ పరిధిలో మిగతా చోట్ల కూడా నిల్వ ఉన్న మురుగునీటిని అంచలవారీగా తొలగించే ప్రయత్నం చేస్తామని ఇఒ తెలిపారు. దీనికి గ్రామస్తులు, పెద్దలు కూడా సహకరించాలని ఆయన కోరారు.



పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది